క్లుప్తంగా

చదువుకున్న కళాశాలకే ప్రిన్సిపాల్



ప్రిన్సిపాల్ ప్రభువరంను అభినందిస్తున్న అధ్యాపకులు

వీరవాసరం: ఎస్వీఎస్ అండ్ వీఈసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా సీహెచ్ ప్రభువరం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలగా మారిన తరువాత డాక్టర్ కె.కృష్ణకాంత్‌ను ప్రిన్సిపల్‌గా నియమించారు. ప్రస్తుతం ఆయన ఇంటర్మీడియట్ బోర్డు విధుల నిర్వహణలో డిప్యూటేషన్‌పై వెళ్లారు. సీనియర్ లెక్చరర్‌గా ఉన్న సీహెచ్ ప్రభువరంను నూతన ప్రిన్సిపల్‌గా ఎంపిక చేశారు. నూతన ప్రిన్సిపాల్ సీహెచ్ ప్రభువరంను కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు అభినందించారు. ఈయన ఇదే కళాశాలలో ఇంటర్ 1982–84 బ్యాచ్‌లో విద్యను అభ్యసించారు. చదువుకున్న కళాశాలకే ప్రిన్సిపాల్‌గా నియమితుడవ్వడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

మావుళ్లమ్మ సన్నిధిలో తెలంగాణ ఎలక్షన్ కమిషనర్



ఎలక్షన్ కమిషనర్‌కు ఫోటో అందజేస్తున్న ఆలయ ప్రధానార్చకులు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణ ఇలవేల్పు మావుళ్ళమ్మను తెలంగాణ ఎలక్షన్ కమిషనర్ సి.పార్థసారథి దర్శించుకున్నారు. వీరికి ఆలయ ప్రధానార్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు నిర్వహించి ప్రసాదాలు, శేష వస్త్రం, ఫొటో అందజేశారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

పీఎం ఆవాస్ యోజన ఇళ్ల పరిశీలన



లేఅవుట్‌లో హౌసింగ్ మెటీరియల్ పరిశీలిస్తున్న ఆడిట్ టీం, హౌసింగ్ అధికారులు

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం పట్టణానికి సంబంధించి విస్సాకోడేరు లేఔట్‌లో నిర్మిస్తున్న ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ఇళ్లను బుధవారం కేంద్ర ఏజీ ఆడిట్ టీం జిల్లా హౌసింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఇళ్ల నిర్మాణం పనితీరు, ఎల్ల నిర్మాణం వాడుతున్న మెటీరియల్స్, అకౌంట్స్ తదితరు వాటిని పరిశీలించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో నిర్మాణం పూర్తి ఇళ్ల వివరాలను సేకరించారు. వారి వెంట ఇంచార్జ్ హౌసింగ్ పీడీ పిచ్చయ్య, డి ఈ శివరామ రాజు, ఏ ఈ లు సాంబశివరావు, నాగేంద్ర, రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ



పాఠశాలకు ప్రింటర్‌ను అందజేస్తున్న లయన్స్ ప్రతినిధులు

ఆకివీడు: మండలంలోని దుంపగడపలో కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు లయన్స్ ఆదర్శ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ప్రింటర్ బహూకరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఎస్‌టీహెచ్ ప్రసాద్ మాట్లాడుతూ గత ఏడాది ప్రాథమిక పాఠశాలను జెడ్పీ పాఠశాలగా వర్గోన్నతి చేశారన్నారు. పాఠశాలకు మౌలిక సదుపాయాల్లో భాగంగా ప్రింటర్ సమకూర్చిన లయన్స్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. లయన్స్ ప్రతినిధులు భమిడిపాటి సూర్య భాస్కరరావు, కాకర్ల రాజరాజేశ్వరి, మోటుపల్లి శ్రీనివాసరావు, నేరెళ్ల రామ చెంచయ్య, శ్రీనివాసరాజు, షరీఫ్, అహ్మద్, మన్నే సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

రెండు బైకుల చోరీ

పాలకోడేరు : ఈ నెల 6న పాలకోడేరులో మంగయ్య చెరువు వద్ద తన బావ ఇంటి వద్ద నిలిపిన మోటార్ బైక్‌ను గుర్తు తెలియని దుండగులు అపహరించుకు పోయారని భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన సోమాధుల నాగమణి పాలకోడేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరో సంఘటనలో గత నెల 31న ఉదయం 11 గంటల సమయంలో గొల్లలకోడేరులోని సంజన అపార్ట్‌మెంట్స్ ఎదురుగా వినాయకుడి గుడి వద్ద పార్కింగ్ చేసిన బైక్‌ను అపహరించుకుపోయినట్లు నిడమర్రు మండలం అడవికొలనుకు చెందిన ముద్దం సూర్యచంద్రరావు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాళం శ్రీనివాసరావు తెలిపారు.

కదిలే స్పీడు బ్రేకర్లు

- విచ్చలవిడిగా రోడ్లపై పశువుల సంచారం
- నిత్యం తప్పని అవస్థలు–తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు

భీమవరం అర్బన్: రోడ్లపై అడ్డదిడ్డంగా తిరిగే పశువుల కారణంగా నిత్యం ప్రజలకు, వాహనదారులకు, ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలో కొత్తపూసల మర్రు, గూట్లపాడు, దొంగపిండి, గొల్లవాని తిప్ప గ్రామాల్లో మెయిన్ రోడ్‌లోనే కాకుండా ఏ వీధిలో చూసినా వందలాది ఆవుల మంద కారణంగా తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వాహనాలపై వెళ్లేవారికి అకస్మాత్తుగా రోడ్లపైకి వచ్చే పశువులతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. అంతేకాకుండా స్కూల్‌కి వెళ్లే విద్యార్థులను ఆవుల పొడవాటి కొమ్ములతో పొడిచి గాయపరుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు బారిన పడుతున్న వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతూనే ఉంటుంది. ఆయా గ్రామాలలో ఆవుల యజమానులు కట్టకుండా పాలు తీసుకొని రోడ్లపైకి వదిలేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. రాత్రులు వాహనాలకు అడ్డంగా నిలబడటమే కాకుండా ప్రమాదాలకు కారణమవుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. దీంతో ఆస్పత్రిలో వైద్య ఖర్చులకు, వాహనాల మరమ్మతులకు తడిసిమోపెడవుతుందని పలువురు వాపోతున్నారు.

ప్రధాన కూడళ్లల్లో కొమ్ములతో భయపెడుతున్న ఆవులు

కొత్తపూసలమర్రు, గూట్లపాడు, గొల్లవానితిప్ప గ్రామాలలో మెయిన్ రోడ్లపై వందలాది పశువులు గుంపులుగా తిరుగుతూ వాటి కొమ్ములతో దాడి చేస్తున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. దీంతో తమ పిల్లలను రోడ్లపైకి పంపాలంటేనే భయమేస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.



మెయిన్‌రోడ్డుపై గుంపులుగా తిరుగుతున్న పశువులు

చెరువుల గట్లు ధ్వంసం

మండలంలో రొయ్యలు, చేపలు చెరువులు ఎక్కువగా ఉండటంతో పశుగ్రాసం కోసం ఆవులు మందలుగా గట్లపై తిరుగుతూ గట్లను ధ్వంసంచేస్తున్నాయని ఆక్వా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

వందలాది ఆవులు రోడ్లపైకివచ్చి దాడులు చేస్తున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు సర్వత్రా వెల్లువెత్తుతున్నాయి. పశువులను గ్రామంలో లేకుండా దూరంగా తోలుకెళ్లాలని లేకుంటే బంధులదొడ్లు ఏర్పాటుచేసి పశువుల యజమానులకు జరిమానాలు విధించాలని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆవుల యజమానులకు నోటీసులు ఇచ్చి హెచ్చరించాలని ఆయా గ్రామస్తులు కోరుకుంటున్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వ్యక్తి హల్‌చల్

భీమవరం: పట్టణంలోని ఒన్‌టౌన్ పోలీసుస్టేషన్ సమీపంలోని ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద బుధవారం ఒక వ్యక్తి హల్‌చల్ చేశాడు. మద్యం మత్తులో ఉన్న వ్యక్తి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద స్తంభం ఎక్కడంతో చూస్తున్న వారు హడలిపోయారు. విషయం తెలిసిన వెంటనే పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకొని అతనికి నచ్చజెప్పి చెప్పి కిందికి దించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



స్తంభం ఎక్కిన వ్యక్తి

స్వదేశీ ఉత్పత్తుల వాడకంతో దేశాభివృద్ధి

భీమవరం: విదేశీ వస్తువులు విడనాడి స్వదేశీ ఉత్పత్తుల వాడకాన్ని పెంచితేనే దేశాభివృద్ధి సాధ్యమనే నినాదాన్ని గ్రామ స్థాయి నుంచి దేశ స్థాయి వరకు ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలని అఖిల భారత స్వదేశీ జాగరణ మంచ్ సంఘటక్ (ఇన్‌ఛార్జ్) కశ్మీర్ లాల్‌జీ అన్నారు. భీమవరం పట్టణంలోని గౌతమి సేవా సమితి భవనంలో బుధవారం జిల్లా కన్వీనర్ వేమిరెడ్డి హరికృష్ణ అధ్యక్షతన నిర్వహించిన స్వదేశీ జాగరణ మంచ్ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. యువత ఉద్యోగాలకు మాత్రమే ప్రాధాన్యం ఇవ్వకుండా స్వయం ఉపాధిపై దృష్టి పెట్టాలని, చిన్న చిన్న పరిశ్రమలను ఏర్పాటు చేసుకొని తోటి వారికి ఉపాధి కల్పించే విధంగా ఎదగాలన్నారు. రాష్ట్ర మహిళా సంయోజక్ పావని మాట్లాడుతూ దేశంలో ఉపాధి అవకాశాలు పెరగాలంటే స్వదేశీ ఉత్పత్తుల వాడకం పెరగాలని తద్వారా దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. స్వదేశీ తయారీ సంస్థలను ఆదరించాలని, నాణ్యమైన ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశ్యంతో సదస్సులు ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో కనుమూరి శ్రీ హరిరాజు, ఇళ్ల హరికృష్ణ, పెద్దేటి సుబ్బారావు, ఆదిత్య, గూడూరి సాంబమూర్తి, కొప్పర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కశ్మీర్ లాల్‌జీ

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్ నాగార్జునకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఉండి: తహసీల్దార్‌గా బదిలీపై వచ్చిన కె.నాగార్జున బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, మండల రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు, వీఆర్ఏలు ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. కొత్త తహసీల్దార్ నాగార్జున మాట్లాడుతూ అధికారులను సమన్వయ పరుస్తూ ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాలు సమయానుకూలంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మండల వీఆర్వోల అధ్యక్షుడు ఎస్.చిన్నారావు, వీఆర్వోలు, గ్రామ సచివాలయ అధికారులు, తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి, స్వాగతం పలికారు.

చిరస్థాయిగా రవీంద్రనాథ్ ఠాగూర్ రచనలు



స్వాతంత్ర్య పక్షోత్సవాల్లో భాగంగా విద్యార్థుల ర్యాలీ దృశ్యం

భీమవరం: విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన జనగణమణ, వందేమాతరం గీతాలు ధరిత్రిలో చిరస్థాయిగా నిలిచిపోతాయని క్విట్ ఇండియా స్థూపం పునః నిర్మాణ కమిటీ సభ్యుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ అన్నారు. శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 78వ స్వాతంత్ర్య పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని పొట్టి శ్రీరాములు మున్సిపల్ (పీఎస్ఎం) గరల్స్ హైస్కూల్లో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్, చటర్జీల సంస్మరణ కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా మాట్లాడారు. స్కూల్ హెచ్ఎం వారణాసి రాధాకృష్ణ, ఉపాధ్యాయిని కె.మాధవి మాట్లాడుతూ జనగణమణ, వందేమాతరం గీతాల సారాంశాలను ప్రతీ విద్యార్థి తెలుసుకోవాలన్నారు. పక్షోత్సవాల నిర్వహణ కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పీఎస్ఎం, సర్ సీవీ రామన్ హైస్కూల్లో విద్యార్థులకు సమ సమాజ స్థాపనలో నీ పాత్ర, గాంధీజీ కలలు కన్న స్వరాజ్యం వస్తుందా అనే అంశంపై వ్యాస రచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించామని పోటీల్లో విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సీవీ రామన్ స్కూల్ డైరెక్టర్ రవణం వేణుగోపాల్, ప్రిన్సిపల్ సరిత, ఉపాధ్యాయులు పార్వతి, శైలజ, శ్రీదేవి, చిట్టి కుమారి, మహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా నడిచేదెలా..?



మోగల్లు దళితవాడలో రోడ్డుపైనే నెలల తరబడి నీరు నిల్వ ఉండడంతో పసర్లు పట్టిన దృశ్యం

- వదలని వర్షపు నీరు
- దళితుల ఆవేదన

పాలకోడేరు: మేజర్ పంచాయతీ మోగల్లు ఎస్సీ ఏరియాలో దళితుల పరిస్థితి అతి దీనంగా మారింది. వర్షం వస్తే రోజుల తరబడి వర్షపు నీరు వీధుల్లోనే నిల్వ ఉంటుంది. డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో ఈ దుస్థితి ఎదురవుతుంది. దీంతో దుర్వాసన వస్తున్న ఆ మురుగు నీటిలో నుంచే నడుస్తూ రోగాల పాలవుతున్నామనీ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇన్‌చార్జి కార్యదర్శి వలన గ్రామంలో నెల కొన్న సమస్యలు పరిష్కరించలేకపోతున్నారని కనీసం పంచాయతీ సిబ్బంది కూడా ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం బాధాకరమని వారు అంటున్నారు. దోమలు విలయతాండం చేయడంతో నానా ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు. అసలే వర్షాకాలం విద్యుత్ సరఫరా లేనప్పుడు మా పరిస్థితి చాలా దారుణమని వారు ఆవేదన చెందుతున్నారు. ఇదిలా ఉండగా ఈ మురుగు నీరు వలన వ్యాధులు ప్రబలుతున్నాయని ఏఎన్ఎం గాని, వైద్య ఆరోగ్య సిబ్బంది గానీ వచ్చిన దాఖలాలు లేవని ఆరోపిస్తున్నారు. సోమవారం సమస్యను పరిష్కరించాలని ప్రజా సమస్య పరిష్కార వేదికలో కలెక్టర్‌కు మొర పెట్టుకుంటామని వారు తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

భీమవరం: రెండో పట్టణ పరిధిలోని 31వ వార్డులో ఒక వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని టూటౌన్ పోలీసులు తెలిపారు. విజయనగరానికి చెందిన జూజుపల్లి పాపయ్య (56) గతంలో అక్కడ జరిగిన హత్య కేసులో 10 ఏళ్ల జైలు పాలయ్యాడు. సత్ప్రవర్తన కారణంగా 2021లో విడుదలయ్యాడు. భీమవరంలో ఉంటున్న భార్య, కుమారుడు వద్ద కాకుండా వేరే చోట ఉంటున్నాడు. కాగా మద్యానికి బానిసై అధికంగా తాగి ఉరి వేసుకుని ఉంటాడని ఫిర్యాదులో అతని కుమారుడు చిన్నంనాయుడు పేర్కొన్నాడు. ఎస్సై రెహమాన్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కేసుల పరిష్కారానికి పోలీసు శాఖ కృషి చేయాలి

తణుకు అర్బన్: జాతీయ లోక్ అదాలత్‌లో రాజీకి దగ్గ క్రిమినల్ కేసుల పరిష్కారం కోసం పోలీసు శాఖ అధికారులు కృషి చేయాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి అన్నారు. వచ్చేనెల 14వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌పై బుధవారం తణుకు కోర్టులో పోలీసు అధికారులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ క్రిమినల్ కేసుల్లో కక్షిదారులతో మాట్లాడి ఇరుపక్షాలను రాజీ దిశగా తీసుకువచ్చి పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి పాటుపడాలని సూచించారు. రాజీ మార్గమే రాజమార్గమని, రాజీ చేసుకోవడం ద్వారా కక్షిదారుల విలువైన సమయంతోపాటు డబ్బు కూడా సద్వినియోపడుతుందని స్పష్టం చేశారు. సీనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణ సత్యలత, జూనియర్ సివిల్ జడ్జిలు పి.సాయిరామ్, పీవీ రంజిత్‌కుమార్, ఏవీ నాగరాజు, న్యాయవాదులు ఎస్.చిరంజీవిరావు, తాడి ఆంజనేయులు, ఎస్సైలు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టించాలి

ఉండి: నూతన ప్రభుత్వ ఆదేశాల మేరకు చెత్త నుంచి సంపద సృష్టించే కార్యక్రమానికి డంపింగ్ యార్డులు సిద్ధంగా ఉంచాలని ఎంపీడీవో ఎస్.రవీంద్ర తెలిపారు. బుధవారం మండలంలోని కార్యదర్శులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ తడి చెత్త,పొండి చెత్తా విధానంలో ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఎంపీడీవో ఆదేశించారు. ఈవోపీఆర్‌డీ రామకృష్ణారెడ్డి, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల పెంపకంపై అవగాహన తప్పనిసరి

ఉండి: కోళ్ల పెంపకాన్ని కుటీర పరిశ్రమగా చేపట్టాలనుకునే ఔత్సాహికులకు కోళ్ల పెపకంపై అవగాహన తప్పనిసరని శాస్త్రవేత్తలు, అధికారులు తెలిపారు. కేవీకేలో రెండు రోజులపాటు నిర్వహించిన కోళ్ల పెపకంపై శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా రెండో రోజు కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ ఎన్.మల్లిఖార్జునరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో విస్సాకోడేరు వెటర్నరీ డాక్టర్ హేమ మాట్లాడుతూ కోళ్ల పెంపకం చేయదలచినవారు ముందుకు తక్కువ మొత్తంలో కోళ్లు తెచ్చుకుని పెంపకంపై అవగాహన కల్పించుకోవాలన్నారు. తదుపరి పెపకాన్ని విస్తరించాలని సూచించారు. చిన్న తరహా కుటీర పరిశ్రమ ఫీల్డ్ ఆఫీసర్ కేవీజీ యాదవ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీపై అందించే పథకాలను వివరించారు. కోళ్ల పెంపకం కుటీర పరిశ్రమగా చేపట్టదలచిన వారికి ప్రభుత్వం 50 శాతం వరకు సబ్సిడీపై రుణం అందిస్తుందన్నారు. అలాగే కోళ్ల మాంసంతో ఉత్పత్తులు తయారు చేసే పరిశ్రమలకు 15 నుంచి 30 శాతం సబ్సిడీ రుణాలను అందిస్తున్నారన్నారు. ఈ పథకాలు కావలసిన వారు సమీపంలోని వెటర్నరీ డాక్టర్‌ను గాని చిన్న తరహా పరిశ్రమల జిల్లా అధికారిని గాని సంప్రదించొచ్చన్నారు. డాక్టర్ ఎన్.దెబోరామెస్సియానా, డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, డాక్టర్ వినయలక్ష్మీ, బి.రజిత పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ హేమ

గర్భిణులు విధిగా పరీక్షలు చేయించుకోవాలి

తాడేపల్లిగూడెం రూరల్: గర్భిణులు నెలవారీ పరీక్షలను విధిగా చేయించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి అన్నారు. బుధవారం మండలంలోని వెంకట్రామన్నగూడెం గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్ 80, 81లలో తల్లిపాల వారోత్సవాలు, సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్తేరు రాణి మాట్లాడుతూ గర్భవతులు తమ ఆహారంలో చిరుధాన్యాలను తీసుకోవాలన్నారు. తద్వారా బిడ్డ బలవర్ధకంగా ఎదుగుతాడన్నారు. దండగర్ర గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎండి.రజినా బేగం, ఆర్.సుబ్బలక్ష్మి, డి.ప్రభారాణి, ఆర్.ప్రవీణ, కె.కనకలత, సీహెచ్.శాంతకుమారి, మెడికల్ హెల్త్ అసిస్టెంట్‌వి.బాబ్జీ, ఆశా కార్యకర్త వెంకటలక్ష్మి, వీవీ.భాస్కరరావు, కొమ్ముగూడెం కార్యక్రమంలో సూపర్‌వైజర్ జి.బేబి, అంగన్‌వాడీ కార్యకర్తలు టి.రాణి, ఎం.వెంకటరమణ, యు.వెంకటలక్ష్మి, ఇ.మంగతాయారు, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



వెంకట్రామన్నగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు దృశ్యం

ఓరియంటేషన్ ప్రోగ్రాం

పాలకోడేరు: భీమవరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ పెన్నాడలో బుధవారం 2024 అడ్మిటెడ్ బ్యాచ్ స్టూడెంట్స్‌కు ఓరియంటేషన్ అండ్ ఇండక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ డీవీఎస్ చంద్రాజీ విచ్చేసి ఇంజనీరింగ్ మొదటి సంవత్సరంలో జాయిన్ అయినటువంటి విద్యార్థులను ఉద్దేశించి, చదువు యొక్క ప్రాముఖ్యత, వారి బాధ్యత, దేశ అభివద్ధికి విద్యార్థుల బాధ్యతను గురించి వివరించారు. తల్లితండ్రులను కూడా వారి పిల్లలను ఇంజనీరింగ్ విద్యను అభ్యసించే విధంగా తీర్చిదిద్దడంలో వారిని ప్రశంసించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్స్ అడబాల సాయి తేజ, శ్రీమతి అడబాల హర్ష తేజశ్రీ వారి సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో హెచ్‌వోడీలు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): జిల్లాలో ఇటీవల వచ్చిన వరదలు, అధిక వర్షాలకు నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయాన్ని అందించి, రైతులు, కౌలు రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు చింతకాయల బాబూరావు డిమాండ్ చేశారు. పట్టణంలో బుధవారం ఆయన మాట్లాడుతూ సాగుకు ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు ప్రభుత్వమే ఉచితంగా పంపిణీ చేయాలన్నారు. అతి వర్షాలు, వరదలు కారణంగా పంట నష్టంతో జిల్లాలో వేలాది మంది రైతులు నష్టపోయారని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి రెండు మాసాలు పైగా కావస్తున్న పంటల బీమా విధానాన్ని ఇప్పటి వరకు ప్రకటించలేదన్నారు. పంటల బీమాపై విధానాన్ని ప్రకటించి, రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

ఆకివీడు: స్థానిక పూల కొట్టులో పని చేస్తున్న మహమ్మద్‌ను నలుగురు వ్యక్తులు ఈ నెల ఆరో తేదీన కాపుకాసి దాడి చేసినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై నాగబాబు చెప్పారు. స్థానిక ముస్లిం వీధిలో నివసిస్తున్న మహమ్మద్ పనులు ముగించుకొని రాత్రి ఇంటికి వస్తుండగా అయ్యప్ప, రఘు మరో ఇద్దరితో కలిసి చేసిన దాడిలో తీవ్రగాయాలు కాగా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

వ్యక్తి అదృశ్యం

మండలంలోని చెరుకుమిల్లికి చెందిన తాసుపల్లి కృష్ణమూర్తి ఈ నెల రెండో తేదీ నుంచి కనిపించడం లేదని అతని కుమారుడు దుర్గా ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై బి.నాగబాబు బుధవారం చెప్పారు. బంధువుల ఇళ్లలోనూ, చుట్టు పక్కల వెతికినప్పటికీ ఆచూకీ తెలియక పోవడంతో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

విద్యార్థి భవితకు మార్గదర్శి పాఠశాల కమిటీ

నేడు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు

ఆకివీడు: విద్యార్థుల భవిష్యత్‌కు మార్గదర్శకంగా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు (ఎస్ఎంసీ) ఉండాలని విద్యా హక్కు చట్టం చెబుతుంది. తమ పిల్లలు విద్యలో ఉన్నత ప్రమాణాలు సాధించే విధంగా, పాఠశాలల ప్రభావాన్ని ప్రోత్సహించడానికి దోహదపడేందుకు తోడ్పడుతాయి. ప్రభుత్వ పాఠశాలల్లో జవాబుదారీ తనం ఏర్పాటు చేయడంలో కీలకమైంది స్కూల్ మేనేజ్‌మెంట్. పాఠశాలల పని తీరు, పాఠశాలల అభివృద్ధికి వచ్చే గ్రాంట్లు వినియోగం, విద్యా ప్రమాణాల మెరుగునకు కమిటీలు దోహదపడతాయి. మేనేజ్‌మెంట్ కమిటీ ఏర్పాటుకు సభ్యులుగా విద్యార్థుల తల్లిదండ్రులు, లేదా సంరక్షకులు అయి ఉండాలి. ఎస్ఎంసీలో సగం మంది మహిళలు తప్పనిసరిగా ఉండాలని చట్టంలో ఉంది.

ఉత్సాహంగా కమిటీల ఏర్పాటు

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఏర్పాటుకు విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకులు ఉత్సాహం చూపుతున్నారు. ప్రతీ పాఠశాలలో కమిటీల ఏర్పాటుతో ఆయా పాఠశాలల్లో కోలాహలంగా కమిటీల ఏర్పాటుకు సన్నాహాలు చేశారు. పాఠశాలల అభివృద్ధికి, ఉపాధ్యాయుల పనితీరు, పాఠశాలల మేనేజ్‌మెంట్, విద్యా ప్రమాణాల పెంపునకు కమిటీలు పని చేయాల్సి ఉంటుంది. ఎన్నికకైన కమిటీ రెండు సంవత్సరాల కాల పరిమితి కలిగి ఉంటుంది.



పాఠశాలలో విద్యా బోధన చేస్తున్న ఉపాధ్యాయురాలు

వెంటనే ప్రమాణ స్వీకారం

ఉదయం సభ్యుల ఎన్నిక, తరువాత ఎస్ఎంసీకి ఎన్నిక నిర్వహిస్తారు. చైర్మన్, వైస్ చైర్మన్ల ఎంపిక నిర్వహిస్తారు. ఇద్దరిలో ఒకరు మహిళ అయి ఉండాలి. ఎన్నిక వ్యవహారం పూర్తయిన తరువాత 2 నుంచి 2.30 గంటల మధ్య ప్రమాణ స్వీకారం నిర్వహిస్తారు. అనంతరం మొదటి సమావేశం నిర్వహించి, మినిట్ పుస్తకంలో రాస్తారు.

కమిటీల ఏర్పాటు ఇలా..

- తరగతికి ముగ్గురు సభ్యులు చొప్పున ఎంపిక నిర్వహిస్తారు.
- పాఠశాలకు 15 మంది సభ్యులుంటారు.
- ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు ముగ్గురుంటారు.
- బీసీ, ఓసీ (ఈబీసీ), మైనార్టీలు ముగ్గురుంటారు.

ఎస్ఎంసీల ఏర్పాట్లు సిద్ధం



స్కూల్ మేనేజ్‌మెంట్ (ఎస్ఎంసీ) కమిటీల ఎన్నికకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశాం. మా స్కూల్‌లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకూ విద్యార్థులు చదువుతున్నారు. తరగతికి ముగ్గురు సభ్యుల చొప్పున 30 మంది సభ్యులు ఎస్ఎంసీలో ఉంటారు. వీరందరూ కలిపి చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకుంటారు. మరో ఆరుగురు ఎక్స్అఫీషియో సభ్యులు, ఇద్దరు కోఆప్షన్ సభ్యులుంటారు.

– ఎస్‌టీహెచ్ ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు, జెడ్పీ స్కూల్, దుంపగడప

- మొత్తం సభ్యుల్లో ప్రతీ తరగతిలో ఇద్దరు మహిళా సభ్యులు తప్పనిసరి.
- ఆరుగురు ఎక్స్అఫీషియో సభ్యులుంటారు.
- హెచ్ఎం, సీనియర్ ఉపాధ్యాయులు, మహిళా సభ్యురాలు, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ, ఏఎన్ఎంలు ఉంటారు.
- ఇద్దరు కోఆప్షన్ సభ్యులుగా దాత, గ్రామ పెద్ద ఉంటారు.